క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటర్లు 11,069

వైరా: ఈ నెల 27న జరిగే ఖమ్మం నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో మొత్తం 5 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వైరా నియోజకవర్గ కేంద్రంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగిలిన నాలుగు మండలాల్లో ఆయా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఓటర్లు 11,069 మది పట్టభద్రులు ఉండగా.. వీరిలో పురుషులు 7,230, మహిళలు 3,839 పట్టభద్రులు ఉన్నారు.

సమస్య పరిష్కరించాలి



మంత్రి నాగేశ్వరరావుతో లారీ యజమానులు

సత్తుపల్లి: సత్తుపల్లి బొగ్గు లారీ లోడింగ్ సమస్యను పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లి స్వగృహంలో బుధవారం లారీ యజమానులు కలిసి విన్నవించుకున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సింగరేణి అధికారులతో చర్చించి తగు న్యాయం జరిగే చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేష్‌రెడ్డి, ఎస్‌కె కీజర్, పిఎల్ ప్రసాద్, మౌలాలీ, లియాకత్‌అలీ, చెన్నాచారి, మోసిన్, శ్రీను, కిట్టు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చింతకాని: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 2004–05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత కలుసున్న వీరంతా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను నెమరెసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలను చేసి ఆటపాటలతో సందడి చేశారు. విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు రఫీ, భద్రయ్య, యోహాను, ఖాజామియా, పూర్వ విద్యార్థులు రమేష్, నరేష్, లక్ష్మణ్, షబీర్, సత్యనారాయణ, మాధవి, శైలజ, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.


నియామకం..



రాములుకు నియామక పత్రం అందజేస్తున్న సీతారాములు

కొణిజర్ల: ఐఎన్‌టీయుసీ అనుబంధ ఆర్‌డబ్ల్యూఎస్ వర్కర్ల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన తలారి రాములు (పంతులు) నియమితులయ్యారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు బుధవారం రాములుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ వర్కర్ల సంక్షేమానికి కృషిచేయాలని సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



పాపిరెడ్డి(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కర్నాటి పాపిరెడ్డి(93) బుధవారం మృతి చెందాడు. ఈయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పాపిరెడ్డి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పలువురు నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. మృతికి కుటుంబసభ్యులకు తెలిపి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరామర్శ..

తల్లాడ: మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ తాతా మధు, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావులు పరామర్శించారు. తల్లాడ మండలం మిట్టపల్లిలో రాయల స్వగృహంలో ముందుగా శేషగిరిరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శేషగిరిరావు భార్య పద్మావతి, కుమారులు రఘునందన్, రేవంత్‌లను వారు పరామర్శించి.. కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

‘ఉత్తి’ పోతలు



బుగ్గవాగుపై నిర్మించిన విశ్వనాథపల్లి ఎత్తిపోతల పథకం

మరమ్మతులకు నోచుకోని ఎత్తిపోతల పథకాలు

- తుప్పపట్టిపోతున్న మోటార్లు
- దశాబ్దాలుగా నిర్లక్ష్యం
- అడుగడుగునా నిర్వహణ లోపం
- బీడు భూములుగా మారిన వందల ఎకరాల ఆయకట్టు

రూ.లక్షలు వెచ్చించినా.. లక్ష్యం నెరవేరలేదు. నిలువెత్తు నిర్లక్ష్యంతో ఎత్తిపోతల పథకం నీరు గారిపోయింది. అధికారుల నిర్లక్ష్యమో, లేక పాలకుల అలసత్వమో.. వెరసి దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోక ఎత్తిపోతల పథకం మూలకుపడిపోయింది. ఎత్తిపోతల పథకంతో.. మూడు పంటలు పండించుకోవచ్చు, ఇక తిండి గింజలకు కొదువలేదు, అని ఆశపడిన అన్నదాతలకు నిరాశే మిగిలింది.

కారేపల్లి: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామం వద్ద బుగ్గవాగుపై 2,000ల సంవత్సరంలో ఏపీ ఎస్‌ఐడీసీ పథకం కింద అప్పటి రాజ్యసభ సభ్యుడు వై.రాధాకృష్ణమూర్తి నిధులు రూ. 12.36 లక్షలతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈ పథకం ద్వారా విద్యుత్ మోటర్లు పైపులైన్ల ద్వారా సమీపంలోని బేతాళకుంట చెరువు, పోకాలకుంట చెరువు, బూరుగుకుంట చెరువుల్లోకి నీటిని నింపి.. ఆయకట్టులో ఉన్న 103 మంది రైతులకు సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా ఎత్తి పోతల పథకాన్ని నిర్మించారు. సుమారు ఆరేళ్లపాటు సజావుగా నడవటంతో ఆయకట్టు రైతులు మూడు పంటలు పండించుకున్నారు. ఈ క్రమంలోనే.. బుగ్గవాగు వరద ఉధృతి ఎక్కువ కావటంతో ఎత్తిపోతల పథకం మోటర్లు వరద నీటికి తడిసిపోయి పాడైపోయాయి. దీంతో పాటు, అక్కడక్కడ పైపులైన్లు సైతం పగిలిపోయాయి. దీంతో ఆయకట్టు రైతులు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు.

సర్వేలతో సరిపెడుతున్న అధికారులు..

మైనర్ ఇరిగేషన్ పథకాలపై 2013వ సంవత్సరంలో దృష్టిపెట్టిన ఐటీడీఏ అధికారులు మండలంలో మైనర్ ఎత్తిపోతల పథకాల పనితీరుపై సర్వే చేయించారు. ఈ క్రమంలో విశ్వనాథపల్లి బుగ్గవాగుపై నిర్మించిన ఎత్తిపోతల పథకం మరమ్మతుల విషయమై ఐటీడీఏ ఇంజనీరింగ్, వ్యవసాయశాఖ, ఐకేపీ సిబ్బంది సంయుక్తంగా సర్వే చేపట్టి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సమగ్ర నివేదికను ఐటీడీఏ ఉన్నతాధికారులకు నివేదించారు. సర్వే పూర్తై 11సంవత్సరాలు కావస్తున్నా.. మరమ్మతులపై ఎలాంటి పురోగతి లేకపోవటంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెగళ్లపాడు గ్రామంలో..



పెగళ్లపాడులో పనిచేయని ఎత్తిపోతల పథకం

ఎర్రుపాలెం: కట్లేరుపై సన్న, చిన్నకారు రైతుల భూములకు సాగునీరు పంపిణీ కోసం పెగళ్లపాడు గ్రామంలో 2009లో రూ.50 లక్షలతో నిర్మించిన ఎత్తిపోతల పథకం మరమ్మతుకు గురైంది. లిఫ్ట నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదు. దశాబ్ద కాలంకిపైగా ఎత్తిపోతల స్కీం లిఫ్ట పనిచేయడం లేదు. ఈ ఎత్తిపోతల పథకాన్ని మాత్రం గాడిలో పెట్టని తీరుపై పాలకులు, అధికారులు తీరుపై రైతాంగం వాపోతుంది. ఇది ప్రారంభించినప్పటి నుంచి కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేసింది. పదేళ్లకు పైగా చుక్కనీరుకూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెగళ్లపాడు, ఎర్రుపాలెం, జయంతి గ్రామాలకు చెందిన 105 మంది రైతుల 175 ఎకరాల భూములకు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..



ఎత్తిపోతల పథకం పనిచేయని మాట వాస్తవమే. లిఫ్ట్ మరమ్మతుల కోసం రూ.23.5 లక్షల నిధుల మంజూరుకు గాను ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతు చేసి.. రైతులకు నీరందిస్తాం.

– సాంబశివరావు, ఇరిగేషన్ డీఈ

సర్వే పూర్తయినా పట్టింపులేదు..



సర్వే పూర్తై 11ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయక పోవటం బాధాకరం. మండల వ్యాప్తంగా ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు, వ్యవసాయ శాఖ, ఐకేపీల ఆధ్వర్యంలో 2013లో జరిగిన సర్వేలో 6 మైనర్ ఇరిగేషన్, ఒక మేజర్ ఇరిగేషన్ పథకం మరమ్మతులకు రూ.49.45 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. సర్వే పూర్తయినా ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోకపోవడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

– వడ్డె అజయ్‌బాబు, ఎంపీటీసీ, విశ్వనాథపల్లి

మరమ్మతులు చేపట్టాలి..



లిఫ్టుకు ఆనుకునే కట్లేరు ఉంది. వర్షాకాలం, శీతాకాలాలో పుష్కలంగా నీరు ఉంటుంది. ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద నాకు ఎకరం భూమి ఉంది. సాగునీరు అందక పంట చేతికొచ్చే సమయానికి పంట ఎండిపోతుంది. ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు, నిర్వహణ మాత్రం పూర్తిగా మరిచారు. పాలకులకు, అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. పాలకుల నిర్లక్ష్యంతోనే లిఫ్ట మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. కాలువలు కూడా పూడిపోయాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సగ్గుర్తి సంజీవరావు, ఆయకట్టు రైతు, పెగళ్లపాడు



మరమ్మతులకు నోచుకోని మోటార్లు

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

కేసులు పెట్టినా తగ్గని అక్రమార్కులు



లక్ష్మీపురంలో అధికారులు స్వాధీనం చేసుకున్న జేసీబీ

కొణిజర్ల: మండలంలో మట్టి తోలకందార్ల ధాటికి గుట్టలు కూడా కనుమరుగవుతున్నాయి. నిత్యం జేసీబీలు, ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తోలకాలు చేపడుతున్నారు. ఓ వైపు అటవీ అధికారులు కేసులు పెడుతున్నా ముఖ్య ప్రజా ప్రతినిధులతో వారిపై ఒత్తిడి తీసుకువచ్చి మాకెవరురా అడ్డు అన్నట్లుగా తవ్వకాలు చేపడుతున్నారు. కొణిజర్ల మండలంలోని లక్ష్మీపురం, మెకాలకుంట, జంపాలనగర్, రామనర్సయ్య నగర్ వరకు అటవీ భూముల్లో ఉన్న గుట్టలు, బోళ్ల రామనరసయ్య నగర్‌కు చెందిన కొంత మంది వ్యక్తులు తవ్వకాలు చేపట్టి మట్టి దర్జాగా అమ్ముకుంటున్నారు. లక్ష్మీపురం జంపాలనగర్ గ్రామాల్లో కొంత మంది రైతులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వడంతో వాటిని సాకుగా చూపి భూమి చదును చేస్తున్నామని చెప్పి గుట్టుచప్పుడు కాకుండా మట్టి తోలకాలు చేపడుతున్నారు. గుట్టలు చదును చేసి పెడితే తమకు పొలం కలుస్తుందని రైతులు ఆనంద పడుతున్నారు. కానీ అటవీ భూముల్లో భూమి హక్కు పత్రాలు ఇచ్చినా గుట్టలు, బోళ్లు తవ్వకూడదని అటవీ అధికారులు చెబుతున్నా మట్టి తోలకం దార్లు అగడం లేదు. ఇటీవల అటవీ అధికారులు రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని కేసులు పెడితే ముఖ్య ప్రజా ప్రతినిధితో వారికి ఫోన్ చేయించి జేసీబీలను విడిపించుకు పోయినట్లు అటవీ అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. భూమి చదును చేసినందుకు ఇటు రైతుల వద్ద, మట్టి అమ్ముకుని రెండు వైపులా లాభాలు గడిస్తున్నారు మధ్య దళారులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్టలు ధ్వంసం చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీన్మార్ మల్లన్నకు ఓటేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి పక్కన అభ్యర్థి మల్లన్న, నాయకులు

సత్తుపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మట్టా రగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలో బుధవారం ప్రైవేట్ కళాశాలల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల, ప్రైవేట్ విద్యాసంస్థల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటుగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు దయానంద్ ఆయా సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన గొంతుకై వారికోసం పనిచేస్తానని చెప్పారు. అదే విధంగా ఎమ్మెల్యే, ఎంపీ రఘురాంరెడ్డి, దయానంద్ మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసి మభ్యపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీని తరిమి కొట్టాలన్నారు. పదేళ్ల పరిపాలించిన బీజేపీ రెండుకోట్లు ఉద్యోగాలిస్తామని చెప్పి.. కోటి ఉద్యోగాలు తీసివేసిందని, పెద్దపెద్ద కంపెనీలు ప్రైవేట్‌కు అమ్మేసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ రాయల నాగేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, నర్సింహారావు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, వసుమర్తి చందర్‌రావు, కళాశాలల కరస్పాండెంట్‌లు దొడ్డా శ్రీనివాసరెడ్డి, జీవి లింగారెడ్డి, కూసంపూడి మధు, పాల ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎం.మమంద్రారెడ్డి, నాయుడు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైరా: ఇండియా కూటమి అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లలో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ కో చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ సూర్యదేవర బాలకృష్ణ కోరారు. బుధవారం వైరాలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసిందని, ఉమ్మడి ఖమ్మం జిల్లా పట్టభద్రులంతా 27వ తేదీన జరిగే ఉప ఎన్నికలో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

సన్నాహక సమావేశంలో..

ఎర్రుపాలెం/చింతకాని: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలో, చింతకానిలోని నాగులవంచ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ మహ్మద్ జావీద్, మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి నాయకులు నర్సింహారావు, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణరావు, వెంకట్రామిరెడ్డి, అక్కిరెడ్డి, శ్రీనివాసరావు, కాంతారావు, బాబురావు, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు గోపాలరావు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



కల్లూరు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు/తల్లాడ/పెనుబల్లి: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం కల్లూరు, పెనుబల్లిలోని బీఆర్‌ఎస్ నాయకులు బొప్పన రామారావు, భుక్యా ప్రసాద్ నివాసాలలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అదే విధంగా తల్లాడ మండలంలోని నారాయణపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలపరచిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పట్ట భద్రులను కలుసుకొని రాకేష్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలనీ కోరారు. ఈ నెల 24న సత్తుపల్లిలో గ్రాడ్యుయేట్స్‌తో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ సమావేశానికి నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ హాజరు అయ్యేవిధంగా నాయకులు కృషి చేయాలని కోరారు. సిట్టింగ్ స్థానాన్ని మరోసారి కైవసం చేసుకోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. తల్లాడలోని అన్నారుగూడెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్నేపల్లి ప్రసన్నకుమార్ బీఆర్‌ఎస్ సభ్యత్వం కల్గి ఉన్నందును రూ.2 లక్షల బీమా చెక్కును బుధవారం కుటుంబ సభ్యులకు సండ్ర వెంకటవీరయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు, రామారావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, రఘు, రామకృష్ణ, కమ్మి, నాగేశ్వరరావు, రవూఫ్, వెంకటేశ్వరరావు, తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తల్లాడ సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌లాల్, కోటారెడ్డి, జీవీఆర్, శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి భుక్యా ప్రసాద్, నాయకులు వినీల్, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌ల అశోక్‌కుమార్, తావునాయక్, చలపతి రావు, అప్పారావు, సీతారాములు, వెంకటరెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



వాకర్లను ఓట్లు అభ్యర్థిస్తున్న సంబూరి రామలింగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సత్తుపల్లి ఇన్‌చార్జ్ బాణాల లక్ష్మారెడ్డి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ సంబూరి రామలింగేశ్వరరావు కోరారు. బుధవారం పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్, వివిధ రంగాల ఉద్యోగులు, విద్యాసంస్థల బాధ్యులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, నాగస్వామి, శ్రీను, పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని కొదుమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఈ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందన్నారు. అవసరమైన వారికి పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివమ్మ, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



మీనవోలులో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని బుధవారం ఆలయ అర్చకులు కాశావజుల రాము ఘనంగా నిర్వహించారు. ప్రతీఏటా వైశాఖ మాసం పురస్కరించుకుని స్వామి కల్యాణాన్ని జరిపిస్తుంటారు. పలువురు పుణ్యదంపతులచే స్వామికల్యాణం సాంప్రదాయబద్దంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కల్లూరు: కల్లూరు, చెన్నూరు సొసైటీల, చిన్నకోరుకొండి సొసైటీల పరిధిలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ ఎం.రూప బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న కల్లూరు సొసైటీలో, 24న చెన్నూరు సొసైటీలో, 25న చిన్నకోరుకొండి సొసైటీలలోని రైతు వేదికల వద్ద రాయితీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీలుగులు కావాల్సిన రైతులు ఉదయం 9 గంటలకల్లా ఆయా సొసైటీలలోని రైతు వేదికల వద్దకు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు..

మధిర: మండలంలోని పలు సహకార పరపతి సంఘాల్లో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. సిద్ధినేనిగూడెం, దెందుకూరు, ఖమ్మంపాడు, మధిర సహకార సంఘాలకు జీలుగు విత్తనాల ప్యాకెట్లు వచ్చాయి. అయితే విత్తన నాణ్యత పరిశీలనకు గాను మండల వ్యవసాయ అధికారులకు శాంపిల్స్ పంపించారు. వ్యవసాయ శాఖ అధికారుల నుంచి అనుమతి రాగానే.. జీలుగు ప్యాకెట్లు పంపిణీ చేస్తామని మధిర రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్ తెలిపారు. ఒక్కొక్క కేజీకి రూ.56 చొప్పున సబ్సిడీ ఉందని, 30 కేజీల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క ప్యాకెట్ ధర సుమారు రూ.1,120 ఉంటుందని తెలిపారు. పూర్తిస్థాయి వివరాలను రెండు మూడు రోజుల్లో ప్రకటించడం జరుగుతుందన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

మధిర: ఈ నెల 24న జరగబోయే పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ కోరారు. పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష సన్నాహక సమావేశాన్ని బుధవారం మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షకు ఇన్విజిలేటర్‌గా ఎంపికైన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మధిర పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ మల్యాల రామస్వామి పాల్గొని మాట్లాడారు. మధిర పట్టణంలోని టీవీఎం, సీపీఎస్ ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. టీవీఎం పాఠశాలలో 220 మంది, సీపీఎస్ పాఠశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులతో సహా ఇన్విజిలేటర్లు కూడా పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్ తీసుకొని రాకూడదని, స్మార్ట్ వాచెస్ ధరించి రాకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, పరీక్ష సమయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. జవాబులు హెచ్ బి పెన్సిల్‌తో మాత్రమే రాయాల్సి ఉంటుందని తెలిపారు.

ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన మిస్ట్ విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: ఈసెట్ పరీక్షా ఫలితాల్లో సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. 100లోపు ఇద్దరు విద్యార్థులు, 200లోపు ఆరుగురు విద్యార్థులు, వెయ్యిలోపు 18 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, కరస్పాండెంట్ సాంబశివరావు, డీన్ రామచంద్రరావు, జాకీర్ హుస్సేన్, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



జి.చైత్ర



జి.లాస్య

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపాలెం జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు జి.చైత్ర, జి.లాస్యలు జాతీయ స్థాయికి చెందిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల హెచ్ఎం ఏవీబీ కృష్ణకుమారి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింగరేణి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పెద్దమ్మ బాబు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సురేందర్ మనియార్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మేదరి టోనీవీరప్రతాప్ రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు, 50కేజీల బియ్యాన్ని బుధవారం కారేపల్లిలో అందజేశారు. అదే విధంగా బైక్ ప్రమాదంలో గాయపడిన భరత్ నగర్‌కాలనీకి చెందిన రాజా కుటుంబానికి టోనిప్రతాప్ రూ.5 వేలు అందించాడు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు పోలగాని శ్రీనివాసరావు, తాజుద్దీన్, మండల పరిషత్ కోఆప్షన్‌మెంబర్ ఎండీ హనీఫ్, ఎస్‌కే మజీద్ పాషా, ఎండీ యాకూబ్ అలీ, గడ్డమీద రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

పెద్దమ్మ బాబు కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీసెల్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ 50కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డొంకెన రవీందర్, ఎండీ ఖలీలుల్లాఖాన్, ఎస్‌కే అబ్దుల్‌వాహీద్, నాగరాజు, హమాలీ సంఘం నాయకులు రాంబాబు, వెంకన్న, గోపి, రామారావు, విజయ్, కృష్ణ, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.

పేద వృద్ధురాలికి..



నిత్యావసరాలు అందిస్తున్న సుధారాణి

సత్తుపల్లిటౌన్: మంచానికే పరిమితమై అవస్థ పడుతున్న ఓ పేద వృద్ధురాలు సత్యవతికి సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి బుధవారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించి చేయూతనందించారు. వెన్నుముక వ్యాధివల్ల రెండు కాళ్లు చచ్చుబడి గత పదేళ్లగా మంచానికే పరిమితమై అవస్థ పడుతున్న ఆమె కష్టాన్ని తెలుసుకొని ధాతృత్వాన్ని చాటుకున్నారు.